సాక్షి
అనంతపురం

బుధవారం, 29, మే, 2024



చీనీ టన్ను రూ.36 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.36 వేలు పలికాయి.



కసరత్తు.. అల్లరిమూకల చిత్తు

సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ప్రశాంతంగా ముగించడమే లక్ష్యంగా ఎస్పీ గౌతమి శాలి చర్యలు తీసుకుంటున్నారు. 8లో

గరిష్టం/కనిష్టం
39.1°/24.6°

జిల్లాలో మంగళవారం పగటి ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగాయి. గాలి వేగం పెరిగింది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమైంది. నైరుతి దిశగా గంటకు 8 నుంచి 14 కిలోమీటర్ల వేగంతో వడగాలులు వీచాయి.

న్యూస్‌రీల్

తాడిపత్రిలో పోలీసు ప్రత్యేకాధికారి పర్యటన



టెంట్లను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి కరీముల్లా

తాడిపత్రి అర్బన్: తాడిపత్రిలో మంగళవారం పోలీసు ప్రత్యేకాధికారి కరీముల్లా పర్యటించారు. పోలింగ్ అనంతరం చోటు చేసుకున్న హింసాత్మక ఘటనల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ పలు జిల్లాలకు ప్రత్యేక పోలీసు అధికారులను నియమించిన విషయం విదితమే. జిల్లాకు కరీముల్లాను నియమించగా, మంగళవారం ఆయన తాడిపత్రిలో పర్యటించారు. స్థానిక అర్బన్ పోలీసుస్టేషన్‌ను తనిఖీ చేశారు. అల్లర్లు జరిగిన జూనియర్ కళాశాల మైదానాన్ని పరిశీలించారు. అల్లర్లకు దారితీసిన పరిస్థితులపై ఆరా తీశారు. బందోబస్తుపై సమీక్షించారు. ముందు జాగ్రత్త చర్యగా కళాశాల మైదానంలో పోలీసుల కోసం ఏర్పాటు చేస్తున్న టెంట్లను పరిశీలించి, తగిన సూచనలు చేశారు. అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని సిబ్బందిని ఆదేశించారు. డీఎస్పీలు టీవీ శివారెడ్డి, బి.శ్రీనివాసులు, కె.జనార్దన్‌నాయుడు ఉన్నారు.

'విత్తన నాణ్యతలో రాజీ పడేది లేదు'

అనంతపురం అగ్రికల్చర్: విత్తన వేరుశనగ నాణ్యతలో రాజీపడేది లేదని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ఎండీ ఎస్. శివ ప్రసాద్ అన్నారు. జిల్లాకు మంగళవారం ఆయన విచ్చేశారు. కల్లూరులోని ప్రాసెసింగ్ ప్లాంట్లను సందర్శించారు. విత్తన నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాణాలకు అనుగుణంగా వేరుశనగ శుద్ధి చేయాలన్నారు. విత్తన పంపిణీకి కొరత ఏర్పడకుండా సరఫరా వేగవంతం చేయాలని ఆదేశించారు. ఆయన వెంట ఏపీ సీడ్స్ జిల్లా మేనేజర్ కే. సుబ్బయ్య, ఏడీఏ వెంకట్రాముడు, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

ప్రతి రైతుకూ విత్తన వేరుశనగ

- డీఏఓ ఉమామహేశ్వరమ్మ



మాట్లాడుతున్న డీఏఓ ఉమామహేశ్వరమ్మ

గుత్తి రూరల్: ప్రతి రైతుకూ విత్తన వేరుశనగ అందజేస్తామని జిల్లా వ్యవసాయ అధికారి (డీఏఓ) ఉమామహేశ్వరమ్మ తెలిపారు. పట్టణంలోని డ్వామా కార్యాలయంలో మంగళవారం రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఏఓ మాట్లాడుతూ సబ్సిడీ విత్తనాలు ప్రతి రైతుకూ అందించాలనే ఉద్దేశంతోనే ప్రభుత్వం మూడు బస్తాలు ఇస్తోందన్నారు. విత్తనం వేసినప్పటి నుంచి పంట తొలగించే వరకూ వ్యవసాయ సిబ్బంది అండగా ఉంటారన్నారు.సమయానుకూలంగా విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను రైతులకు అందజేస్తామని భరోసా ఇచ్చారు. పంటల సాగు అనంతరం సరైన సమయంలో శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. గ్రామాల్లో రైతులకు సలహాలు, సూచనలు ఇవ్వాలని వ్యవసాయ సిబ్బందిని డీఏఓ ఆదేశించారు. అనంతరం శాస్త్రవేత్తలు ఎరువుల యాజమాన్యం, సస్యరక్షణ చర్యలు, భూసార పరీక్షలు, మేలైన విత్తన ఎంపిక తదితర విషయాలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఆత్మా పీడీ మద్దిలేటి,ఏడీఏ వెంకట్రాముడు, రెడ్డిపల్లి ఏఆర్ఎస్ శాస్త్రవేత్తలు నటరాజ్, భాస్కర్, చందన, ఎఫ్‌టీసీ శ్రీనివాసులు, ఏఓ ముస్తాక్ అహ్మద్, ఎంపీఈఓ షారోన్, వీఏఏలు మానస, అజయ్, రైతులు సుభాష్‌రెడ్డి, రంగయ్య, ఓబుళయ్య పాల్గొన్నారు.

రేపు 'హలో అనంత రైతన్న' కార్యక్రమం



గుత్తి రూరల్: ఉద్యాన పంటల సాగులో సందేహాల నివృత్తి కోసం ఈ నెల 30న హలో అనంత రైతన్న ఫోన్ ఇన్ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ మేరకు గుత్తి ఉద్యాన శాఖ అధికారి మిత్రవింద మాధవి మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఉమ్మడి జిల్లాలో పండ్ల తోటలు, కూరగాయలు, పూల తోటలు సాగు చేస్తున్న రైతులు గురువారం రాత్రి 7.15 గంటలకు 08554-225533 నంబర్‌కు ఫోన్ చేసి పంటల సాగులో తాము ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం తెలుసుకోవచ్చు. రైతుల సందేహాలను రాప్తాడు ఉద్యాన అధికారి రత్న కుమార్ నివృత్తి చేయనున్నారు.

నమో నారసింహ

- అంగరంగ వైభవం.. లక్ష్మీనృసింహుడి బ్రహ్మ రథోత్సవం
- గోవింద నామస్మరణతో మార్మోగిన పెన్నహోబిలం



పెన్నహోబిలంలో అశేష భక్తజనం నడుమ సాగుతున్న లక్ష్మీనృసింహుడి బ్రహ్మ రథోత్సవం



ఉత్సవమూర్తులను ఊరేగింపుగా తీసుకొస్తున్న ఆలయ అధికారులు, అర్చకులు

ఉరవకొండ: నమో నారసింహ నామస్మరణతో పెన్నహోబిలం పుణ్యక్షేత్రం మార్మోగిపోయింది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రధాన ఘట్టమైన శ్రీవారి బ్రహ్మ రథోత్సవం అశేష భక్త జనం మధ్య మంగళవారం అంగరంగ వైభవంగా సాగింది. ఈ సందర్భంగా ఉదయం స్వామికి సుప్రభాత సేవ, అర్చన, అలంకరణ, ఉత్సవ నిత్యహోమాలు నిర్వహించారు.శ్రీదేవి, భూదేవి సమేత నృసింహుడి ఉత్సవమూర్తులను పట్టు వస్త్రాలతో అలంకరించి మేళతాళాల మధ్య ఊరేగింపుగా తీసుకొచ్చి రథంపై అధిష్టింపచేశారు. ఉదయం 10 గంటలకు విశేషంగా అలంకరించిన స్వామి మడుగుతేరును ఆలయ ఈఓ విజయ్ కుమార్, ప్రధాన అర్చకులు ద్వారకానాథ్‌చార్యులు, బాలాజీస్వామి ఆధ్వర్యంలో ఉత్సాహంగా నిర్వహించారు. సాయంత్రం ధూళోత్సవం అనంతరం బ్రహ్మ రథోత్సవం ప్రారంభించారు. అశేష భక్త జనం తరలి రాగా రథోత్సవం కనులపండువగా సాగింది. 'నమో నారసింహ', 'గోవిందా గోవింద' అంటూ భక్తులు చేసిన నామస్మరణతో పెన్నహోబిల క్షేత్రం మార్మోగింది. రథంపైకి భక్తులు అరటిపండ్లు, జామపండ్లు విసిరి మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవంలో మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి పాల్గొని స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రథోత్సవం సందర్భంగా పోలీసులు గట్టి బందోబస్తు చేపట్టారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వై.శ్రీనాథ్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకులు అశోక్, తేజోనాథ్, మూలగిరిపల్లి ఓబన్న తదితరులు పాల్గొన్నారు.



శ్రీవారి జ్యోతిని భక్తులకు చూపుతున్న ప్రధాన అర్చకులు ద్వారకానాథ్‌చార్యులు

82 మార్కులు సాధిస్తే 18 వేశారు!

- పదో తరగతి మూల్యాంకనంలో ఇన్విజిలేటర్ తప్పిదం
- రీ వెరిఫికేషన్‌లో బయటపడిన వైనం





గోగుల అంజి

అధికారులు పంపిన రీవెరిఫికేషన్ పత్రం

బత్తలపల్లి: పదో తరగతిలో ఫెయిల్‌గా చూపిన ఓ విద్యార్థి.. జవాబు పత్రం రీ వెరిఫికేషన్‌లో ఏకంగా 82 మార్కులతో ఉత్తీర్ణత సాధించాడు. వివరాలు... బత్తలపల్లి మండలం రాఘవంపల్లికి చెందిన గోగుల సూర్యనారాయణ కుమారుడు అంజి మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో పదో తరగతి చదివాడు. ఈ ఏడాది మార్చిలో బత్తలపల్లిలోని జెడ్పీహెచ్ఎస్ కేంద్రంగా పబ్లిక్ పరీక్షలు రాశాడు. తెలుగులో 98, హిందీ 89, గణితం 92, భౌతిక శాస్త్రం 87, సాంఘిక శాస్త్రంలో 86 మార్కులు సాధించాడు. అయితే ఇంగ్లిష్‌లో కేవలం 18 మార్కులు వేయడంతో ఉత్తీర్ణత సాధించలేకపోయాడు. మెరిట్ విద్యార్థిగా మన్ననలు పొందిన అంజి ఫెయిల్ అయ్యాడనగానే ఉపాధ్యాయులు ఆశ్చర్యపోయారు. మానసికంగా కుదేలైన బాధిత విద్యార్థికి సదరు ప్రైవేట్ పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ ధైర్యం చెప్పి వెంటనే రీ వెరిఫికేషన్‌కు దరఖాస్తు చేయించారు. ఈ ఫలితాలు సోమవారం అందాయి. 100కు 82 మార్కులు వచ్చాయి. ఇన్విజిలేటర్ తప్పిదం కారణంగా తమ కుమారుడు ఇన్ని రోజులు మానసిక వేదన అనుభవించాడని తల్లిదండ్రులు తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి తప్పిదాలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకోవాలని విద్యాశాఖాధికారులను కోరారు.

ఎరువుల దుకాణాల ఆకస్మిక తనిఖీ



ఎరువుల దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు

అనంతపురం: నగరంలోని పలు ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మంగళవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. పాతూరులో ఉన్న ఎస్‌వీఎస్ అగ్రీ సొల్యూషన్స్, ఆర్టీసీ బస్టాండు వద్ద ఉన్న బాలాజీ ట్రేడర్స్‌ను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఎస్‌వీఎస్‌లో నిల్వలకు, స్టాక్ రిజిస్టర్‌లో నమోదు చేసిన వివరాలకు వ్యత్యాసం, స్టాక్ బోర్డు, రిజిస్టర్‌లను సరిగా నిర్వహించకపోవడాన్ని గుర్తించారు. అంతేకాక అనుమతి లేని విత్తన విక్రయాలను నిలుపుదల చేస్తూ నోటీసులు జారీ చేశారు. వీటి విలువ రూ.55,556 చేస్తుందని నిర్ధారించారు. తనిఖీల్లో విజిలెన్స్,ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ కె.శ్రీనివాసులు, వ్యవసాయాధికారి జె.వాసుప్రకాష్, ఎస్ఐ ఫణీంద్రనాథరెడ్డి, ఎంఏఓ శశికళ తదితరులు పాల్గొన్నారు.

బంగారు 'భవిత'

- ప్రత్యేక అవసరాల పిల్లల సంక్షేమానికి ప్రభుత్వం చర్యలు
- భవిత కేంద్రాల ద్వారా ఉన్నత భవితకు బాటలు
- సమగ్రశిక్ష ద్వారా పలు సంక్షేమ పథకాల వర్తింపు
- 'డోర్ టు డోర్' సర్వే చేస్తూ ప్రత్యేక పిల్లలను గుర్తిస్తున్న ఐఈఆర్పీలు



పెద్దవడుగూరు మండలం కాసేపల్లిలో సర్వే చేస్తున్న సమగ్ర శిక్ష సిబ్బంది

జిల్లాలో భవిత కేంద్రాలు	31
ప్రత్యేక అవసరాల పిల్లలు	4,407
ఈ ఏడాదిలో ఇప్పటిదాకా గుర్తించిన పిల్లల సంఖ్య	639

అనంతపురం ఎడ్యుకేషన్: ప్రత్యేక అవసరాల పిల్లల ఉజ్వల భవితకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. వారిలో మార్పు తీసుకొచ్చి బడిబాట పట్టించేందుకు అనేక కార్యక్రమాలు చేపడుతోంది. సమగ్ర శిక్ష ద్వారా ప్రత్యేకంగా భవిత కేంద్రాలు ఏర్పాటు చేసి ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ రీసోర్స్ పర్సన్ (ఐఈఆర్పీ)ల ద్వారా ఆ పిల్లలకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. అవసరమైన పిల్లలకు ఫిజియోథెరపిస్టుల ద్వారా వారం వారం ఫిజియోథెరపీ చేయిస్తున్నారు. వేసవి సెలవులు ప్రారంభమైన తర్వాత ఈ నెల 1 నుంచి ఐఈఆర్పీలు గ్రామాల్లో సర్వే చేస్తూ ప్రత్యేక అవసరాల పిల్లలను గుర్తిస్తున్నారు. 0–18 ఏళ్లలోపు ఉన్న పిల్లల కోసం సర్వే పక్కాగా చేస్తున్నారు. ఆయా గ్రామాల్లో సచివాలయాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆరా తీస్తున్నారు. ఇప్పటిదాకా 639 మంది పిల్లలను గుర్తించారు. పాఠశాలల్లో చేరని పిల్లలతో పాటు మధ్యలో చదువు మానేసిన పిల్లలు, చదువుతుంటే అంగన్‌వాడీనా?, పాఠశాలనా? అనే అంశాలపై సమగ్రంగా సర్వే చేస్తున్నారు. వివరాలను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు ఆన్‌లైన్‌లో పంపుతున్నారు.

తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తూ...

ఇంట్లో పరిస్థితుల దృష్ట్యా కొందరు తల్లిదండ్రులు ప్రత్యేక పిల్లలను బడులకు పంపేందుకు ఆసక్తి చూపడం లేదు. అలాంటి వారికి ఐఈఆర్పీలు అవగాహన కల్పిస్తున్నారు. చదువు వల్ల కలిగే ప్రయోజనాలు, బడులకు పంపితే వారిలో కలిగే మార్పులు, ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు, సదుపాయాలను తెలియజేస్తున్నారు. అంగన్‌వాడీ స్కూళ్లు, ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు, భవిత కేంద్రాల్లో చేర్పించేలా చర్యలు తీసుకుంటున్నారు.

సదుపాయాలూ 'ప్రత్యేకం'

ప్రత్యేక అవసరాల పిల్లలకు ప్రభుత్వం నాలుగు రకాల అలవెన్సులు అందజేస్తోంది. బడికి వచ్చే మానసిక, బుద్ధిమాంద్యం పిల్లలకు, ఇంటివద్ద ఉంటున్న వారికి, బాలికలకు ప్రత్యేక అలవెన్సులు ఇస్తున్నారు. బడికొచ్చే పిల్లలకు రీడర్ అలవెన్స్ కింద నెలకు రూ. 200 చొప్పున పది నెలలకోసారి రూ.2 వేలు అందజేస్తున్నారు. అలాగే ఎస్కార్ట్ అలవెన్స్ కింద నెలకు రూ. 300 చొప్పున 10 నెలలకు రూ. 3 వేలు ఇస్తున్నారు. బాలికలకు ప్రత్యేకంగా గర్ల్‌చైల్డ్ అలవెన్స్ కింద నెలకు రూ. 200 ప్రకారం పది నెలలకు రూ.2వేలు ఇస్తున్నారు. బడికి రాలేని పిల్లలకు హోమ్ అలవెన్స్ కింద నెలకు రూ. 300 ప్రకారం పది నెలలకు రూ. 3 వేలు ఇస్తారు. బడికి వెళ్తున్న వారికి ఇతర విద్యార్థులతో పాటు యూనిఫాం, పాఠ్యపుస్తకాలు, షూ, టై అందజేస్తారు. 'అమ్మ ఒడి' పథకం వర్తింపజేస్తున్నారు. దివ్యాంగ చిన్నారుల విద్యను డిజిటలైజేషన్ చేసి ట్యాబ్‌లు కూడా అందజేస్తున్నారు.

ముమ్మరంగా సర్వే



జిల్లాలో 0–18 ఏళ్లలోపు ప్రత్యేక పిల్లలను గుర్తించేందుకు సర్వే ముమ్మరంగా సాగుతోంది. కలెక్టర్, సమగ్ర శిక్ష డీపీసీ, ఏపీసీ ఆదేశాల మేరకు ప్రతి గ్రామాన్నీ జల్లెడ పడుతున్నాం. ఐఈఆర్పీలు ఆయా గ్రామాలకు వెళ్లి ప్రత్యేక అవసరాల పిల్లల తల్లిదండ్రులను కలిసి వారి పిల్లలు ఏ స్కూళ్లలో ఎన్‌రోల్ అయ్యారో తెలుసుకుంటారు. ఎక్కడా ఎన్‌రోల్ కాని పిల్లలను సమీప పాఠశాలల్లో చేర్పించేలా చర్యలు తీసుకుంటాం. ప్రత్యేక అవసరాల పిల్లల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది.

– షమా, సహిత విద్య జిల్లా కోఆర్డినేటర్, సమగ్రశిక్ష, అనంతపురం

కౌంటింగ్‌కు సహకరించండి

- కలెక్టర్ వినోద్‌కుమార్
- రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం





సమావేశానికి హాజరైన అభ్యర్థులు, పార్టీల ప్రతినిధులు, అధికారులు, మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగానికి అభ్యర్థులు, రాజకీయ పార్టీలు సంపూర్ణ సహకారం అందించాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వి.వినోద్‌కుమార్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో డీఆర్ఓ జి.రామకృష్ణారెడ్డితో కలిసి అభ్యర్థులు, పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి కౌంటింగ్ ప్రక్రియ నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఓట్ల లెక్కింపునకు కౌంటింగ్ సూపర్‌వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లు, మైక్రో అబ్జర్వర్లు 954 మంది, ఇతర సేవలకు 400 మందిని నియమింటామన్నారు. కౌంటింగ్ కోసం ప్రతి నియోజకవర్గానికీ 14 టేబుళ్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఉరవకొండ నియోజకవర్గానికి మాత్రం 18 టేబుళ్లు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. కౌంటింగ్ ఏజెంట్లకు గుర్తింపు కార్డులను జూన్ 2న అందిస్తామన్నారు. కౌంటింగ్ హాళ్లు, పరిసరాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కౌంటింగ్ రోజు ఉదయం ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్‌రూమ్‌లను అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్ల సమక్షంలో తెరుస్తామన్నారు. ముందుగా పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు చేపడతామన్నారు. ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రారంభమవుతుందని, కౌంటింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ పూర్తి చేసిన తరువాత కౌంటింగ్ హాళ్లు, టేబుళ్లను వారికి కేటాయిస్తామని చెప్పారు. కేంద్రంలోకి ఫోన్లు అనుమతించమన్నారు.

లాటరీ పద్ధతిలో కేంద్రాల ఎంపిక..

14 టేబుళ్ల కౌంటింగ్ పూర్తైతే ఒక రౌండ్ పూర్తి చేసినట్లని కలెక్టర్ తెలిపారు. పోలైన ఓట్ల ప్రకారం రౌండ్ల సంఖ్య ఉంటుందన్నారు. ఈ ప్రకారం రాయదుర్గం అసెంబ్లీ నియోజకవర్గం ఓట్ల లెక్కింపు పూర్తికి 22 రౌండ్లు, ఉరవకొండ 19 రౌండ్లు, గుంతకల్లు 20 రౌండ్లు, తాడిపత్రి 20 రౌండ్లు, శింగనమల 21 రౌండ్లు, అనంతపురం అర్బన్ 21 రౌండ్లు, కళ్యాణదుర్గం 19 రౌండ్లు, రాప్తాడు నియోజకవర్గ ఓట్ల లెక్కింపు పూర్తికి 21 రౌండ్లు పడుతుందన్నారు. నియోజకవర్గానికి సంబంధించి ఐదు వీవీప్యాట్ స్లిప్‌లను లెక్కిస్తామన్నారు. లాటరీ పద్ధతిలో నియోజకవర్గం పరిధిలోని ఐదు పోలింగ్ కేంద్రాలను ఎంపిక చేసి, వాటికి సంబంధించిన వీవీప్యాట్ స్లిప్‌లు లెక్కిస్తామని చెప్పారు.

పటిష్ట పోలీసు బందోబస్తు

కౌంటింగ్ సందర్భంగా పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. సివిల్ పోలీసులతో పాటు కేంద్ర బలగాలు బందోబస్తు నిర్వహిస్తాయన్నారు. పాసు ఉన్న వారిని మాత్రమే జేఎన్‌టీయూ ప్రధాన ద్వారం నుంచి లోపలికి అనుమతిస్తారన్నారు. జేఎన్‌టీయూ మొత్తం సీసీ కెమెరాల నిఘాలో ఉంటుందన్నారు. జేఎన్‌టీయూ ఆవరణలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేస్తామన్నారు. ఎస్పీ అక్కడి నుంచి మానిటరింగ్ చేస్తారన్నారు. కౌంటింగ్ పూర్తయిన తరువాత ఊరేగింపులు, విజయోత్సవాలకు అనుమతి లేదన్నారు. 144 సెక్షన్, 133 సెక్షన్ అమలులో ఉన్నాయని, ఎవరైనా ఆయుధాలు, రాళ్లు, కర్రలు వంటి వస్తువులు అక్రమంగా కలిగి ఉంటే చర్యలు తీసుకుంటామన్నారు. గెలుపోటములను సమానంగా తీసుకోవాలని సూచించారు.

బ్యారికేడింగ్ పనులు ముందుగా పూర్తి చేయండి

ఓట్ల లెక్కింపు కేంద్రంలోకి అధికారులు, ఏజెంట్లు వచ్చేందుకు బ్యారికేడింగ్ పనులు ముందుగా పూర్తి చేయాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వి.వినోద్‌కుమార్ ఆదేశించారు. జేఎన్‌టీయూలో ఏర్పాటు చేస్తున్న కౌంటింగ్ కేంద్రాల పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. కేంద్రాల్లో టేబుళ్లు, కుర్చీలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి పని వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో నగర పాలక కమిషనర్ మేఘ స్వరూప్, అసిస్టెంట్ కలెక్టర్ బి.వినూత్న, డీఆర్ఓ జి.రామకృష్ణారెడ్డి, రిటర్నింగ్ అధికారులు, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాల పరిశీలన

అనంతపురం ఎడ్యుకేషన్: పదో తరగతి, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్ష కేంద్రాలను కలెక్టర్ వినోద్‌కుమార్ మంగళవారం తనిఖీ చేశారు. అనంతపురం నగరంలోని రాజేంద్ర మున్సిపల్ హైస్కూల్, ఆలమూరు రోడ్డులో ఉన్న ఎస్ఆర్ జూనియర్ కళాశాల కేంద్రాన్ని పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరీక్షలు సజావుగా జరిగేలా చూడాలని సిబ్బందికి సూచించారు.విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. కాగా, ఎస్ఆర్ జూనియర్ కళాశాలలో 563 మంది విద్యార్థులను కేటాయించగా, మంగళవారం 12 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు.కలెక్టర్ వెంట ఆర్ఐఓ వెంకటరమణ నాయక్, డీఈఓ వరలక్ష్మి, కళాశాల ప్రిన్సిపాల్ జగదీష్, చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

'పది' గణితం పరీక్షకు 3,697 మంది హాజరు

అనంతపురం ఎడ్యుకేషన్: పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షల్లో భాగంగా మంగళవారం జరిగిన గణితం పరీక్షకు జిల్లాలో 3,697 మంది విద్యార్థులు హాజరయ్యారు. 45 కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొత్తం 8,173 మంది విద్యార్థులకు గాను 4,476 మంది గైర్హాజరయ్యారు. అధికారులు వివిధ పరీక్ష కేంద్రాలను తనిఖీలు చేశారు.

కోటంక సుబ్రహ్మణ్యేశ్వరుడికి ఆభరణాల వితరణ


బంగారు ఆభరణాన్ని అందజేస్తున్న దాతలు

గార్లదిన్నె: మండలంలోని కోటంకలో వెలసిన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయానికి అనంతపురానికి చెందిన దంపతులు సుగుణ, జగదీశ్వర రెడ్డి, కుమార్తెలు నవ్య, ప్రసన్న రూ.4 లక్షలు విలువ చేసే బంగారు రుద్రాక్ష దండ, రూ.88,860 విలువ చేసే బంగారు పూతతో ఉన్న వెండి వేలాయుధాన్ని అందజేశారు. ఈ సందర్భంగా దాతల పేరుతో స్వామికి ప్రధాన అర్చకుడు రామాచార్యులు అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించి ఆభరణాలను అలంకరించి, తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఈఓ నాగేంద్రుడు, గ్రామ పెద్దలు తాతిరెడ్డి, రామలింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత

కూడేరు: కర్ణాటక నుంచి అక్రమంగా జిల్లాలోకి తరలించుకుని వస్తున్న రూ.2.41 లక్షల విలువ చేసే మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు అనంతపురం సెబ్ సీఐ యల్లయ్య తెలిపారు. మంగళవారం సెబ్ అధికారులు కూడేరు మండలంలో పర్యటించారు. కొర్రకోడు వద్ద బొలెరో వాహనాన్ని ఆపి తనిఖీ చేయడంతో 40 బాక్సుల్లో తరలిస్తున్న కర్నాటక మద్యం టెట్రా ప్యాకెట్లు బయటపడ్డాయి. వాహనాన్ని సీజ్ చేసి, డ్రైవింగ్ చేస్తున్న యజమాని కొర్రకోడు గ్రామానికి చెందిన రామ్మోహన్‌ని అరెస్ట్ చేశారు. కార్యక్రమంలో సెబ్ ఎస్‌ఐ సరస్వతి, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

బొమ్మనహాళ్: మండలంలోని కాలువపల్లి, గంగవరం గ్రామాల్లో చేపట్టిన ఉపాధి పనులను డ్వామా పీడీ వేణుగోపాలరెడ్డి మంగళవారం పరిశీలించారు. ఫారంపాండ్, రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్ పనులు, వాటి ఐడీలను తనిఖీ చేశారు. ప్రభుత్వం రూ.300 వేతనాన్ని అందిస్తోందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఉపాధి కూలీలకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుబ్బరాజు, ఏపీడీ విజయలక్ష్మి, పీఆర్ఆర్డీ మాధవరెడ్డి, ఏపీఓ సూర్యప్రకాష్, టీఏలు నాగేంద్రప్ప, స్వాతి, ఎఫ్‌ఏలు పెద్దన్న, మహేంద్ర పాల్గొన్నారు.

'అనంత' క్రీడా మకుటం

- దేశవ్యాప్తంగా ఖ్యాతి తెచ్చిన నీలం సంజీవరెడ్డి స్టేడియం
- సల్దానా విగ్రహం ఏర్పాటు చేయాలని నాటి క్రికెటర్ల విజ్ఞప్తి


అనంతపురంలోని నీలం సంజీవరెడ్డి స్టేడియం

అనంతపురం/కల్చరల్: అనంతపురం పేరు వినగానే ఎవరికైనా పోరాటాలు, రికార్డులకు కేంద్రబిందువైన ప్రాంతంగా గుర్తుకు వస్తుంది. అలాంటి అనంతపురానికి క్రీడల్లో దేశవ్యాప్తంగా ఖ్యాతి తెచ్చింది నీలం సంజీవరెడ్డి స్టేడియం. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే హైదరాబాద్ తర్వాత నిర్మితమైన స్టేడియంగా అరుదైన రికార్డును సొంతం చేసుకుంది. బెంగళూరులో కూడా స్టేడియం లేని ఆ రోజుల్లో అనంతపురం కేంద్రంగా క్రీడామైదానం నిర్మాణం ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది. అనంతరం అనతి కాలంలోనే ఎంతో మంది క్రీడాకారులను ప్రపంచానికి పరిచయం చేసింది. మరెన్నో రాష్ట్రస్థాయి సాంస్కృతిక ఉత్సవాలకు వేదికగా మారింది. అనంత క్రీడా మకుటంలో కలికితురాయిగా నిలిచిన నీలం సంజీవరెడ్డి స్టేడియంపై 'సాక్షి' ప్రత్యేక కథనం.

నిర్మాణంలో సింహభాగం ప్రైవేట్ వ్యక్తులే

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని ప్రధాన క్రీడా మైదానాల్లో ఒకటిగా నిలిచిన నీలం సంజీవరెడ్డి స్టేడియాన్ని ప్రభుత్వం కాకుండా ప్రైవేట్ వ్యక్తులే నిర్మించారంటే ఆశ్చర్యం కలుగకమానదు. వివిధ రాష్ట్రస్థాయి క్రీడలకు వేదికగా నిలిచిన ఈ స్టేడియం ప్రస్తుతం వాకర్స్‌కు ప్రధాన కేంద్రంగా మారింది. ఉదయం 5 గంటలైతే చాలు మెరుగైన ఆరోగ్యం కోసం పరుగులు పెట్టే నగరవాసుల్లో అత్యధికులు ఈ స్టేడియంలోనే ఉంటారు. స్వాతంత్య్రం వచ్చిన తొలి రోజుల్లో క్రికెట్ క్రీడ అంటే కేవలం మెట్రో నగరాలకే పరిమితమై ఉండేది. 1950 తర్వాత దేశమంతటా మోజు పెరిగినా... ఆ రోజుల్లో క్రికెట్ ఆడేందుకు అనువైన మైదానాలు లేక చాలా మంది నిరుత్సాహ పడేవారు. ఎక్కడైనా క్రికెట్ మ్యాచ్ జరుగుతోందంటే చాలు రేడియోల ఎదుట తిష్ట వేసి కామెంటరీ వినేవారు. ట్రాన్సిస్టర్లు అందుబాటులోకి వచ్చిన తర్వాత చెవులకు ఆనించుకుని రోడ్లపై తిరుగుతూ కామెంటరీ వినేవారు.

జిల్లాలో క్రికెట్‌కు పునాది వేసిన ఉత్తర్‌కర్

జిల్లాలో 1950 తర్వాత క్రికెట్‌కు పునాదులు పడ్డాయి. ఆ రోజుల్లో అనంతపురానికి చెందిన క్రీడాభిమాని ఉత్తర్‌కర్ జ్ఞానేశ్వరరావు జిల్లా క్రికెట్ అసోసియేషన్‌ను ఏర్పాటు చేసి, క్రీడాభివృద్ధికి బాటలు వేశారు. అదే సమయంలో జిల్లా కేంద్రంలో క్రికెట్ ఆడేందుకు అనువైన స్థలం కోసం అన్వేషణ కూడా మొదలైంది. ఈ క్రమంలోనే ఊహించని విధంగా క్రీడలన్నా.. క్రీడాకారులన్నా అభిమానం చూపించే ఐపీఎస్ అధికారి జేఎస్ సల్దానా జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించడం ఆయన అన్వేషణకు కలిసి వచ్చింది. ఎస్పీని కలిసి పోలీస్ ట్రైనింగ్ కళాశాల (పీటీసీ)కు చెందిన మైదానం నుంచి కొంత స్టేడియం నిర్మాణానికి కేటాయించాలని జిల్లా క్రికెట్ అసోసియేషన్ తరఫున జ్ఞానేశ్వరరావు, తదితరులు విన్నవించారు. దీనిపై ఎస్పీ సల్దానా సైతం సానుకూలంగా స్పందించారు.

అనంతకు వచ్చిన దిగ్గజాలు

జిల్లా కేంద్రంలో స్టేడియం నిర్మాణమైన సమయానికి ఒక్క హైదరాబాద్ మినహా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని 23 జిల్లాలు, కర్ణాటక రాజధాని బెంగళూరుతో సహా మరెక్కడా క్రికెట్ మైదానం ఉండేది కాదు. టర్ఫ్ వికెట్ కావడంతో జాతీయ స్థాయి ఆటలకు వేదికగా మారింది. దీంతో 1962, 1964, 1971 వరకు ఈ స్టేడియం పలు రంజీ మ్యాచ్‌లకు వేదికగా మారింది. అప్పటి క్రికెట్ భారత జట్టు కెప్టెన్ అజిత్ వాడేకర్, పాలిఉమ్రీగర్, రమాకాంత్ దేశాయ్, చందూ బోర్డే, సర్దేశాయి దిలీప్ తదితరులు ఈ మైదానంలో తమ ఆట తీరుతో అనంత వాసులను ఉర్రూతలూగించారు. ప్రధానంగా చైనా యుద్ధ సమయంలో స్టార్ క్రికెటర్లను ఈ మైదానానికి రప్పించి బెనిఫిట్ మ్యాచ్ ఆడించడం ద్వారా వచ్చిన మొత్తాన్ని ఎన్‌డీఎఫ్ (నేషనల్ డిఫెన్స్ ఫండ్)కు విరాళంగా అందజేశారు. జిల్లా ఖ్యాతిని జాతీయ స్థాయికి ఎదిగేలా చేసిన ఈ క్రీడా మైదానంలో వెల్కమ్ ఆర్చ్‌తో పాటు సల్దానా విగ్రహం ఏర్పాటు చేయాలని నాటి క్రికెటర్లు విజ్ఞప్తి చేస్తున్నారు.

కేవలం ఆరు నెలల్లో పూర్తి

పీటీసీకి చెందిన స్థలం నుంచి కొంత స్టేడియం నిర్మాణానికి కేటాయించగానే 1961లో పనులు మొదలు పెట్టారు. ఆ రోజుల్లో చెన్నైకు చెందిన చిదంబరం (కేంద్ర ఆర్థిక శాఖ మాజీ మంత్రి చిదంబరానికి ఈయన తాత) సాయంతో స్టేడియం నిర్మాణానికి పునాదులు పడ్డాయి. రిజర్వ్ పోలీసుల శ్రమదానంతో కేవలం ఆరు నెలల వ్యవధిలోనే క్రీడా మైదానం రూపుదిద్దుకుంది. హిందూపురానికి చెందిన బస్సు ఓనర్ శ్రీకంఠయ్య, ఆర్‌పీజీటీ బస్సు యజమాని బాలకృష్ణన్, ఉరవకొండ బస్సు ఓనరు దండా వెంకయ్య తదితరులు తమ వంతు ఆర్థిక సాయం అందజేయడంతో పాటు రూ.లక్ష చొప్పున రూ.3 లక్షలకు పైగా విరాళాలు సేకరించి స్టేడియంకు తుదిమెరుగులు దిద్దారు. ఎస్పీ సల్దానా, జ్ఞానేశ్వరరావును కార్యవర్గ సభ్యులుగా ప్రకటిస్తూ వారికి స్టేడియం నిర్వహణ బాధ్యతను అప్పటి పీటీసీ ప్రిన్సిపాల్ ఆనందరామ్ అప్పగించారు. దీంతో స్టేడియంకు పేరు పెట్టాలని భావించి అందరూ సమావేశమై చర్చించారు. జిల్లా ప్రజల కల సాకారం చేసిన సల్దానా పేరు పెట్టాలని ప్రతిపాదిస్తే అందుకు ఆయన సమ్మతించలేదు. పేరు కోసం తానెన్నడూ పనిచేయలేదని, దీంతో జిల్లా కీర్తిప్రతిష్టలను జాతీయ స్థాయికి తీసుకెళ్లిన నీలం సంజీవరెడ్డి పేరును ఏకగ్రీవంగా ఆమోదించి ఆ పేరుతోనే మైదానాన్ని ఆవిష్కరించారు.


1964 మార్చిలో అనంతపురంలో జరిగిన ఇరానీ ట్రోఫీ మ్యాచ్‌లో పాల్గొన్న బొంబాయి, రెస్ట్ ఆఫ్ ఇండియా జట్ల క్రీడాకారులు (ఫైల్)

సల్దానా కృషి మరువలేనిది



నీలం సంజీవరెడ్డి స్టేడియం నిర్మాణంలో ఐపీఎస్ ఆఫీసర్ సల్దానా కృషి మాటల్లో వర్ణించడం చాలా కష్టం. ఆ రోజుల్లో ఆయన వెంట ఉన్నవారిలో ఇప్పుడు దాదాపు ఎవరూ లేరు. ఊరూరా తిరిగి క్రికెట్ క్లబ్‌లు ఏర్పాటు చేసి పోటీలను నిర్వహించడమే కాకుండా తానే స్వయంగా పోటీల్లో పాల్గొని యువతను ఉత్సాహపరిచేవారు. ఈ క్రమంలోనే తానే స్వయంగా మూడు రాష్ట్రాల్లో తిరిగి నిధులు సమకూర్చారు. అర్ధరాత్రి తన వాహనంలో శింగనమలకు వెళ్లి చీకట్లోనే పొలాల బయలు ప్రదేశంలో పడిన గడ్డి సేకరించుకుని వచ్చి స్టేడియంలో టర్ఫ్ వేశారు. ఆయనతో కలిసి రంజీ మ్యాచ్ ఆడే అవకాశం రావడం నా అదృష్టంగా భావిస్తున్నా. సల్దానా విగ్రహంతో పాటు వెల్కమ్ ఆర్చ్ ఏర్పాటు చేస్తే ఆయన రుణం తీర్చుకున్నట్లవుతుందని భావిస్తున్నా.

– జ్ఞానేశ్వరరావు ఉత్తర్‌కర్, మాజీ క్రికెటర్, అనంతపురం


1962లో జరిగిన రంజీ మ్యాచ్‌లో పాల్గొన్న అప్పటి ఎస్పీ సల్దానా, మూర్తి, జ్ఞానేశ్వరరావు (ఫైల్)

వ్యక్తి బలవన్మరణం


బాలకృష్ణ మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఆలూరు సాంబశివారెడ్డి, వీరాంజనేయులు

శింగనమల: మండలంలోని ఉల్లికంటిపల్లి గ్రామానికి చెందిన బాలకృష్ణ (41) ఆత్మహత్య చేసుకున్నాడు. గొర్రెల పోషణతో జీవనం సాగిస్తున్న బాలకృష్ణ ఇటీవల అప్పు చేసి గొర్రెలు కొనుగోలు చేశాడు. దీనికి తోడు గృహ నిర్మాణానికి ప్రైవేట్ వ్యక్తుల వద్ద అప్పు చేశాడు. ఈ క్రమంలో అప్పులు తీర్చే మార్గం కానరాక మంగళవారం విషపు గుళికలు మింగాడు. విషయాన్ని గుర్తించిన కుటుంబ సభ్యులు వెంటనే అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వీరాంజనేయులు, నాయకులు పరంధామరెడ్డి, వెంకటనారాయణ తదితరులు ఆస్పత్రికి చేరుకుని బాలకృష్ణ మృతదేహాన్ని పరిశీలించి, నివాళులర్పించారు. పార్టీ అభ్యున్నతికి ఆయన చేసిన కృషిని వారు గుర్తు చేశారు. బాధిత కుటుంబసభ్యులను పరామర్శించి, అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసానిచ్చారు. కాగా, బాలకృష్ణకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

అట్టహాసంగా హనుమజ్జయంతి వేడుకలు


ఉత్సవ విగ్రహానికి తులసీదళార్చన గావించిన దృశ్యం

గుంతకల్లు: ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవాలయంలో హనుమజ్జయంతి వేడుకలు మంగళవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. వేకువజామునే మూలవిరాట్‌కు అభిషేకం నిర్వహించి బెంగుళూరు నుంచి తెప్పించిన వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. అనంతరం గోపూజతో ఉత్సవాలను ప్రారంభించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో నెట్టికంటి ఉత్సవ విగ్రహాన్ని కొలువు దీర్చి మంత్రోచ్చరణల మధ్య తులసి దళములతో లక్షార్చన గావించారు. కార్యక్రమంలో ఆలయ ఏఈఓ మల్లికార్జున, ఆలయ కమిటీ చైర్మెన్ సుగణమ్మ, ప్రధాన అర్చకుడు గరుడాచార్యులు పాల్గొన్నారు.

పత్తి సాగులో విత్తనశుద్ధి తప్పనిసరి : డీఏఓ


పామిడి: పత్తి సాగుకు ముందు విత్తన శుద్ధి తప్పనిసరిగా చేయాలని రైతులకు జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ సూచించారు. పత్తి సాగుపై రైతులకు, ఆర్బీకే సిబ్బందికి మంగళవారం పామిడి తహసీల్దార్ కార్యాలయంలోని సభాభవనంలో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ఆత్మ పీడీ మద్దిలేటి కలసి ముఖ్యఅతిథిగా డీఏఓ హాజరై, మాట్లాడారు. లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేయడం ద్వారా పత్తిలో గులాబీరంగు పురుగు ఉధృతిని నివారించవచ్చునన్నారు. మట్టిపై క్లోరైడ్‌ను పిచికారీ చేస్తే అధిక దిగుబడి వస్తుందన్నారు. ముందుగా లోతు దుక్కులు చేసి ఒకేసారి పత్తి విత్తనాలు విత్తుకోవాలన్నారు. 1.25 ఎంఎల్ పెండి మిథాలిన్‌ను లీటర్ నీటితో కలిపి ఒక ఎకరాకు పిచికారీ చేయాలన్నారు. అలాగే 30 గ్రాముల మిజిలోఫల్‌ను 30 ఎంఎల్ పైరితైడ్ సోడియంతో కలిపి ఎన్-60, పీ-30, కే-30 కిలోల చొప్పున పోషకాలను ఒక ఎకరాకు మూడు దఫాలుగా వేయాలన్నారు. ఆఖరి దుక్కిలో ఎస్ఎస్‌పీ, బోరాన్, బోరాక్స్ 300 గ్రాములతో పాటు ఎంజీ-300 కిలోల పోషకాలను వేయాలన్నారు. ట్రికోడెర్మా, క్లోరిపైరిఫాస్, ప్రొఫినోఫాస్‌తో గులాబీరంగు పురుగును నివారించవచ్చునన్నారు. కార్యక్రమంలో గుత్తి ఏడీఏ వెంకట్రాముడు, మండల వ్యవసాయాధికారి డి.లీనావసుంధర, డీటీ జి.లక్ష్మీనారాయణరెడ్డి, కేవీకే సైంటిస్ట్ డాక్టర్ చందన, రేకులకుంట ఏఈఆర్ఎస్ శాస్త్రవేత్తలు డాక్టర్ లలేష్మన్, డాక్టర్ నటరాజ్, డాక్టర్ రమేష్‌బాబు, డాక్టర్ భాస్కర్‌రావు, ఏఈఓలు ప్రసాద్, శ్రీనివాస్, రైతులు, ఆర్బీకే సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

394 మంది విద్యార్థులకు ఉద్యోగాలు


ఆకర్షణీయమైన వేతనంతో కొలువులు దక్కించుకున్న విద్యార్థులతో అధ్యాపకులు, అతిథులు

అనంతపురం: క్యాంపస్ సెలక్షన్స్‌లో నగరంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లొమా చివరి సంవత్సరం చదువుతున్న 394 మందికి ఉద్యోగాలు దక్కడంపై ఆ కళాశాల ప్రిన్సిపాల్ సి.జయచంద్రారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం జాబ్ అచీవర్స్ డే (ఉద్యోగ విజయోత్సవం)లో భాగంగా మంగళవారం జాబ్ మేళా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జేఎన్‌టీయూఏ పాలకమండలి సభ్యుడు ఆచార్య బి.దుర్గాప్రసాద్ హాజరై, మాట్లాడారు. అనంతపురం పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లొమా పూర్తి చేస్తే తప్పనిసరిగా ఉద్యోగం వస్తుందనే భరోసా అధ్యాపకులు కల్పించారన్నారు. అల్ట్రాటెక్ సిమెంట్స్, కల్పతరువు ప్రాజెక్ట్స్, ఎఫ్‌ట్రానిక్స్, జిందాల్ సా లిమిటెడ్ తదితర సంస్థల్లో రూ.2 లక్షల నుండి రూ.8.60 లక్షల వార్షిక వేతనంతో కొలువులు దక్కడంపై హర్షం వ్యక్తం చేశారు. ఇందులోనూ టెక్సాస్ ఇన్‌స్ట్రుమెంటేషన్‌లో రూ.8.6 లక్షల వార్షిక వేతనంతో కూడిన కొలువులు దక్కించుకున్న ఇద్దరిని అభినందించారు. అధ్యాపకులకు విద్యార్థుల తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. గౌరవ అతిథిగా డీఆర్‌డీఏ పీడీ నరసింహారెడ్డి, ఇండస్ట్రియల్ ప్రమోషన్ ఆఫీసర్ జేపీ దుర్గేష్, ఎలక్ట్రికల్ విభాగాధిపతి డాక్టర్ ఎం.రామకృష్ణారెడ్డి, ఆటోమొబైల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి ఎస్.శ్రీనివాసరావు, ట్రాన్స్‌కో డీఈఈ గాయత్రి పాల్గొన్నారు.

అశ్వవాహనంపై శ్రీవారు


ఉత్సవమూర్తులను ఊరేగిస్తున్న దృశ్యం

రాయదుర్గం టౌన్: పట్టణంలోని కోటలో వెలసిన ప్రసన్న వేంకటరమణస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం శ్రీవారి పార్వేట ఉత్సవం, అశ్వవాహనోత్సవం కనులపండువగా సాగింది. ప్రత్యేకంగా అలంకరించిన అశ్వ వాహనంపై దేవేరులతో కలసి భక్తులకు శ్రీవారు దర్శనమిచ్చారు. రాయదుర్గం రెడ్డి సంక్షేమ సంఘం, అరే కటిక, నాయీబ్రాహ్మణ, ఈడిగ సంఘాల ఆధ్వర్యంలో అశ్వవాహనం సేవ కొనసాగింది. వినాయక సర్కిల్‌లో బాణాసంచా వేడుక అనంతరం ఉత్సవ మూర్తులను తిరిగి ఆలయానికి చేర్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువనేత మెట్టు విశ్వనాథరెడ్డి, రెడ్డి సంక్షేమ సంఘం నాయకులు గొని ఉపేంద్రరెడ్డి, మాధవరెడ్డి, నాగరాజురెడ్డి, రాజగోపాలరెడ్డి, అంపారెడ్డి, జయరామిరెడ్డి, కేశవరెడ్డి, నాగిరెడ్డి, వెంకటరెడ్డి, ఆలయ పాలక కమిటీ అధ్యక్షుడు పాలాక్షిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు. బుధవారం ఉదయం వసంతోత్సవం, సాయంత్రం మయూర వాహనోత్సవ సేవలు ఉంటాయని ఆలయ ఈఓ నరసింహారెడ్డి తెలిపారు.

తల్లిదండ్రులకు చిన్నారి అప్పగింత


చిన్నారిని అప్పగిస్తున్న ఐసీడీఎస్ అధికారులు

అనంతపురం సిటీ: రైలులో తప్పిపోయిన చిన్నారిని రైల్వే అధికారులు గుర్తించి ఐసీడీఎస్ అధికారుల ద్వారా సురక్షితంగా తల్లిదండ్రుల వద్దకు చేర్చారు. వివరాలు... బెంగళూరుకు చెందిన నాగరాజు, తన కుటుంబసభ్యులతో కలసి సోమవారం మంత్రాలయం రాఘవేంద్రస్వామి దర్శనానికి వెళ్లారు. అదే రోజు సాయంత్రం వారంతా రైలులో బెంగళూరుకు తిరుగు ప్రయాణమయ్యారు. ప్లాట్‌ఫాం మీదుకు రైలు చేరుకోగానే కుటుంబ సభ్యులు హడావిడిగా రెండు బోగీల్లో ఎక్కారు. ఈ క్రమంలో ఎనిమిదేళ్ల వయసున్న నదీషాను ఎవరూ గమనించలేదు. ఆ బోగీలోని కుటుంబసభ్యులతో ఉంటుందని ఈ బోగీలోని వారు ఎవరికి వారు ఊహించుకుని మిన్నకుండిపోయారు. ఈ క్రమంలోనే రైలులో ఒంటరిగా ఉన్న చిన్నారిని గుర్తించిన టికెట్ కలెక్టర్ సమాచారం ఇవ్వడంతో గుంతకల్లులో ఆర్‌పీఎఫ్ సిబ్బంది బాలికను పిలుచుకెళ్లి జీఆర్‌పీ స్టేషన్‌లో అప్పగించారు. అక్కడి నుంచి అనంతపురం ఆర్‌పీఎఫ్ ఎస్‌ఐ మధుకర్‌చారి సహకారంతో ఐసీడీఎస్ పీడీ బీఎన్ శ్రీదేవి, డీసీపీఓ మంజునాథ, చైల్డ్‌లైన్ కో-ఆర్డినేటర్ కృష్ణమాచారి ఆధ్వర్యంలో సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ మేడా రామలక్ష్మి ఎదుట హాజరు పరిచారు. ఆమె ఆదేశాల మేరకు ఆ రాత్రి బాలికకు బాలసదన్‌లో ఆశ్రయం కల్పించారు. మంగళవారం ఉదయం బాలిక ఇచ్చిన సమాచారం మేరకు ఆమె కుటుంబ సభ్యుల వివరాల సేకరించి, అప్పటికే బెంగళూరుకు చేరుకొని బాలిక ఆచూకీ కోసం గాలిస్తున్న కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడించారు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు అనంతపురానికి వచ్చి అధికారులను కలసి నదీషాను పిలుచుకెళ్లారు. ఈ సందర్భంగా అధికారులకు నాగరాజు కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

కసరత్తు.. అల్లరి మూకలు చిత్తు!


రబ్బరు బులెట్లు పరిశీలిస్తున్న ఎస్పీ గౌతమి శాలి

సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌ను ప్రశాంతంగా ముగించడమే లక్ష్యంగా జిల్లా ఎస్పీ గౌతమి శాలి చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా కౌంటింగ్ రోజు పోలీసులు వినియోగించే ఆయుధాలు, పరికరాల సంసిద్ధతను మంగళవారం ఆమె స్థానిక పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో పరిశీలించారు. అల్లర్లు, ఘర్షణలు తలెత్తిన సందర్భాల్లో అల్లరి మూకలను ఎలా చెదరగొట్టాలనే అంశంపై ఏఆర్ పోలీసులకు పలు సూచనలు చేశారు. గ్యాస్ గన్, యాంటీ రైయిట్ గన్, ప్లాస్టిక్ పెల్లెట్స్, బాలిస్టిక్ క్యాట్రిడ్జిలు పనితీరును పరీక్షించారు. పరికరాలు పక్కాగా పనిచేసేలా సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరిగేలా సమష్టిగా పనిచేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ మునిరాజ, ఆర్‌ఐలు రెడ్డప్పరెడ్డి, రాముడు, మధు, ఆర్ఎస్‌ఐ వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

– అనంతపురం:


కసరత్తు చేస్తున్న పోలీసులు

క్లుప్తంగా

ఘర్షణలకు దిగితే కేసుల నమోదు



పులేటిపల్లిలో గడ్డివాముల్లో సోదాలు చేస్తున్న పోలీసులు

చెన్నేకొత్తపల్లి : లెక్కింపు రోజున ఘర్షణలకు దిగితే కేసులు నమోదు చేస్తామని ఎస్‌ఐ వెంకటేశ్వర్లు ప్రజలను హెచ్చరించారు. పులేటిపల్లిలో మంగళవారం ఉదయం కార్డెన్ సెర్చ్ చేపట్టారు. గ్రామంలోని ప్రధాన వీధుల్లో పోలీసులు కవాతు నిర్వహించారు. అనంతరం గ్రామంలోని అనుమానితులు, పాత లిక్కర్ కేసులు ఉన్న వారి ఇళ్లతో పాటు వారి ఇంటి పరిసర ప్రాంతాలలో సోదాలు చేపట్టారు. అనంతరం గ్రామస్తులతో ఎస్‌ఐ సమావేశమై పలు సూచనలు చేశారు. ఓట్ల కౌటింగ్ వరకు మండల వ్యాప్తంగా 144 వ సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. ఎక్కడైనా గొడవలు, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

కుట్టు మిషన్ల పంపిణీ



కుట్టు మిషన్ అందజేస్తున్న దృశ్యం

అనంతపురం ఎడ్యుకేషన్: ఉత్తర అమెరికా తెలుగు సంఘం ఆధ్వర్యంలో నిరుపేద మహిళలకు మంగళవారం కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. స్థానిక ఆదిమూర్తినగర్‌లోని లిటిల్‌ఫ్లవర్ స్కూల్‌లో కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఉత్తర అమెరికా తెలుగు సంఘం నాట్స్ అధ్యక్షులు నూతి బాపయ్య చౌదరి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సంఘం ఆధ్వర్యంలో తెలుగు రాష్ట్రాల్లో పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. భవిష్యత్తులోనూ మరిన్ని కార్యక్రమాలు చేపడతామన్నారు. అనంతరం మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లిటిల్‌ఫ్లవర్ స్కూల్ అధినేత ఆంజనేయులు, నాయుడు, సాయి, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

సేవా దృక్పథం అభినందనీయం



భోజన ప్యాకెట్లను అందిస్తున్న మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: పేద ప్రజలకు అన్నదానం, ఇతర సేవా కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమని మేయర్ వసీం పేర్కొన్నారు. మంగళవారం నగరంలో మలబార్ గోల్డ్ ఆధ్వర్యంలో మేయర్ ప్రజలకు ఉచితంగా భోజన ప్యాకెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలోని 300 మంది అనాథలు, అభాగ్యులకు భోజనం పంపిణీ చేయడం గొప్పవిషయమన్నారు. ఇదే స్ఫూర్తితో మున్ముందు మరిన్ని కార్యక్రమాలను చేపట్టాలని వారికి సూచించారు. డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి, మలబార్ గోల్డ్ మేనేజింగ్ డైరెక్టర్ అహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

శివాలయంలో చోరీ

కుందుర్పి: మండలంలోని రుద్రంపల్లి శివాలయంలో మంగళవారం తెల్లవారు జామున చోరీ జరిగింది. గుర్తు తెలియని దుండగులు ఆలయం తలుపులు ధ్వంసం చేసి, లోపలికి ప్రవేశించారు. హుండీలో ఉన్న రూ. 40 వేలు ఎత్తుకెళ్లారు. దీనిపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు.

మధ్యాహ్న భోజన నిర్వహణపై శిక్షణ



మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

చెన్నేకొత్తపల్లి: స్థానిక కేజీబీవీలో మంగళవారం మండలంలోని మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులకు మధ్యాహ్న భోజన నిర్వహణపై ఒక రోజు శిక్షణ కార్యక్రమం జరిగింది. ట్రైనర్ రాణి భోజన నిర్వహణపై వారికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంఈఓలు మున్వర్‌బాషా, ప్రసన్నకుమార్‌నాయుడు మాట్లాడుతూ పాఠశాలలు జూన్ 12న పునః ప్రారంభమవుతాయన్నారు. భోజన ఏజెన్సీ నిర్వాహకులు ఆయా పాఠశాలల్లోని వంట గదులు, వంట సామగ్రిని శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మెనూ ప్రకారం భోజనం తయారు చేయడంతో పాటు రుచికరంగా ఉండేలా చూడాలన్నారు. వంట తయారు చేసే సమయంలో తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. కేజీబీవీ ఎస్‌వో సువర్ణ, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

కార్పొరేషన్‌కు బకాయిల బండ!

- కొత్తూరు మునిసిపల్ కాంప్లెక్స్ బకాయిలు చెల్లించని వ్యాపారులు
- రెండేళ్లుగా షాపులకు తాళాలు వేసుకుని పత్తాలేని వైనం
- రూ.40 లక్షలకు పైగా బకాయిలు

అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థకు సంబంధించి షాపుల అద్దె బకాయిలు గుదిబండగా మారాయి. సకాలంలో వ్యాపారులు అద్దె చెల్లించకపోవడంతో నగరాభివృద్ధికి ఆటంకంగా మారింది. వివరాల్లోకెళితే..నగరంలోని పాతూరు, కొత్తూరు, సాయినగర్, జూనియర్ కళాశాల సమీపంలో నగరపాలక సంస్థకు చెందిన షాపులు 373 ఉన్నాయి. వీటిలో 80 శాతం షాపులు కొత్తూరు మునిసిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో ఉన్నాయి. కాగా రెండేళ్లుగా ఇక్కడ కొందరు వ్యాపారులు అద్దె చెల్లించడం లేదు. దాదాపుగా 32 షాపులు నిర్వహిస్తున్న వ్యాపారులు అద్దె ఎగ్గొట్టి పత్తా లేకుండా పోయారు. వీరిలో పది షాపుల యజమానులు రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు(ఒక్కొక్కరు) చెల్లించాల్సి ఉంది. మొండి బకాయిదారులు నగరపాలక సంస్థకు రూ.40 లక్షలకుపైగా చెల్లించాలి. కానీ ఇంత వరకు వారి నుంచి ఎటువంటి స్పందన లేదు. నోటీసులు ఇచ్చేందుకు వెళ్లినా అందుబాటులో లేరు. చివరకు లీగల్ నోటీసులు ఇచ్చినా స్పందించకపోవడం గమనార్హం.

లీజు రద్దుకు కసరత్తు

సదరు షాపు నిర్వాహకుల లీజును రద్దు చేసేందుకు నగరపాలక సంస్థ రెవెన్యూ అధికారులు సిద్ధమయ్యారు. తాళాలు వేసి వారికి చివరి నోటీసులు జారీ చేసి, తహసీల్దార్‌తో కలసి పంచనామా చేసి షాపులను స్వాధీనం చేసుకోవాలనే యోచనలో ఉన్నట్లు సమాచారం. అందుకోసం పెండింగ్‌లో ఉన్న వారి జాబితాను సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. మొండి బకాయిదారులకు షాపులను రద్దు చేసి, కొత్తగా వేలంపాట పిలిచి షాపులను కేటాయించే పనిలో అధికారులు నిమగ్నమైనట్లు సమాచారం.

అభివృద్ధికి ఆటంకం

నగరపాలక సంస్థకు వివిధ షాపుల నుంచి ప్రతి నెలా రూ.20 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు వస్తుంది. మొండిబకాయిదారులు చెల్లిస్తే..మరో రూ.5 లక్షల నుంచి రూ.6 లక్షల వరకు వస్తుంది. సకాలంలో బకాయిలు చెల్లించకపోవడంతో ద్వారా నగరాభివృద్ధికి ఆటంకం ఏర్పడుతోంది. ప్రతి నెలా అద్దె జమ అయితే వాటి ద్వారా సాధారణ నిధులతో నగరంలో అభివృద్ధి చేసేందుకు వీలుంటుంది.



కొత్తూరులోని కమర్షియల్ షాపింగ్ కాంప్లెక్స్

చట్టపరమైన చర్యలు తీసుకుంటాం

అద్దె చెల్లించని వ్యాపారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. నిర్దేశిత సమయంలో అద్దె చెల్లించాలని వ్యాపారులకు గతంలోనే నోటీసులు జారీ చేశాం. వారి నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో న్యాయపరమైన చర్యలకు ఉపక్రమిస్తున్నాం.

-మేఘస్వరూప్,
నగరపాలక సంస్థ కమిషనర్

కౌంటింగ్ ప్రక్రియకు పక్కాగా ఏర్పాట్లు



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి వసంత బాబు

రాప్తాడు: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నిర్వహణకు ఏర్పాట్లు పక్కాగా చేపడుతున్నామని అభ్యర్థులు, పార్టీల ప్రతినిధులు ఇందుకు సహకరించాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి వసంత బాబు కోరారు. కౌంటింగ్ నిర్వహణపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 4న ఉదయం 8 గంటలకు జేఎన్‌టీయూలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ మొదలవుతుందన్నారు. మొదట పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కిస్తామన్నారు. కౌంటింగ్ ఏజెంట్ల నియామకానికి సంబంధించి అర్హతలు, కౌంటింగ్ హాల్‌లో నియమావళి, గోప్యత పాటించడంతో పాటు వివిధ ఫారాల సమాచారాన్ని తెలియజేశారు. 18 ఏళ్లు, ఆపై ఉన్నవారిని కౌంటింగ్ ఏజెంట్‌గా నియమించుకోవాలని సూచించారు. కౌంటింగ్ టేబుళ్ల సంఖ్య ఆధారంగా ఏజెంట్లను నియమించుకోవచ్చని తెలిపారు. ఉదయం 7 గంటకల్లా ఏజెంట్లు ఐడీ కార్డులతో హాజరుకావాలని సూచించారు. అసెంబ్లీ, పార్లమెంటు నియోజకవర్గాల పరిధిలో 281 పోలింగ్ స్టేషన్లకు సంబంధించి ఓట్ల టెక్కింపునకు 14 టేబుళ్ల చొప్పున ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. కౌంటింగ్ కేంద్రంలోకి మొబైల్ ఫోన్లకు అనుమతి లేదని, ఒక వేళ ఎవరైనా తీసుకొస్తే వాటిని భద్రపరచడం కోసం ప్రత్యేక కలెక్షన్ పాయింట్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. రౌండ్ల వారిగా ఫలితాలు తెలియజేసేందుకు ప్రత్యేకంగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కౌంటింగ్ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంతో పటిష్ట భద్రత మధ్య నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కౌంటింగ్ ఏజెంట్లు, అధికారులు, సిబ్బంది అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. ఓట్ల లెక్కింపు కీలక ఘట్టమని, ఈ దశను విజయవంతంగా నిర్వహించడంలో రాజకీయపార్టీల ప్రతినిధులు పూర్తి సహకారం అందించాలని కోరారు. అలాగే నియోజకవర్గంలోని ఎన్నికల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల సిబ్బంది సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు.

భక్తిశ్రద్ధలతో జలధి పూజ



అక్కమ్మ దేవతలకు పూజలు నిర్వహిస్తున్న భక్తులు



అక్కమ్మ దేవతల గంపను ఆలయానికి తీసుకొస్తున్న దృశ్యం

ఆత్మకూరు: మండల కేంద్రంలో అక్కమ్మ దేవతల ఉత్సవాల్లో భాగంగా మంగళవారం జలధి పూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయాన్నే ఆలయంలోని అక్కమ్మ దేవతలకు ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం ఆత్మకూరు సమీపంలోని ఓ పొలంలో జలధి పూజ నిర్వహించారు. అక్కడ వేల మంది భక్తుల నడుమ పూజల అనంతరం అక్కమ్మ దేవతలున్న గంపను తలపై పెట్టుకొని ఆలయం వద్దకు చేరుకున్నారు. దారి పొడవునా భక్తులు అక్కమ్మ దేవతల గంపకు నీరు పోసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం పూలమాలలతో అక్కమ్మ దేవతను అలంకరించి పూజలు నిర్వహించారు. నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నదానం చేపట్టారు. బుధవారం ఆలయం చుట్టూ పన్నేరపు బండ్ల ప్రదక్షిణ, పరుష కార్యక్రమం ఉంటుందని నిర్వాహకులు తెలియజేశారు.

మానసిక ప్రశాంతత అవసరం



మాట్లాడుతున్న డాక్టర్ విశ్వనాథ్‌రెడ్డి

బుక్కరాయసముద్రం: ప్రతి ఒక్కరికీ మానసిక ప్రశాంతత ఎంతో అవసరమని జిల్లా సైకియాట్రిస్ట్ నిపుణుడు డాక్టర్ విశ్వనాథ్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని కొర్రపాడు పీహెచ్‌సీ కేంద్రంలో ప్రపంచ స్కిజో ఫ్రినియా దినోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వృత్తి ఏదైనా మానసిక ప్రశాంతత కోసం యోగా, ధ్యానం చేయాలన్నారు. వంశపారంపరంగా, గర్భస్త సమయంలో తల్లికి వైరల్ జ్వరాలు సోకడం, మత్తు పదార్థాలకు బానిస కావడం, చిన్న వయస్సులోనే లైంగిక, భౌతిక దాడులకు గురికావడం ఈ వ్యాధికి కారణమన్నారు. కులుంబ సభ్యులతో సఖ్యతగా లేకపోవడం, ముసలితనంలో వచ్చే మతి మరుపు వంటి లక్షణాలు ఉంటాయన్నారు. ఇలాంటి సమస్య ఉన్నవారిని గ్రామాల్లో వైద్య సిబ్బంది గుర్తించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఇందిరా ప్రియదర్శిని, సీహెచ్‌ఓ మోహన్‌బాబు, శ్రీదేవి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో మాసికా మహోత్సవం



ఆరోగ్య సమస్యలపై కిశోర బాలికలకు అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ ప్రశాంతి

కనగాపల్లి: మామిళ్లపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం మాసికా మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రశాంతి కిశోర బాలికలకు నెలసరిలో వచ్చే సమస్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. బాలికల ఆరోగ్య ఎదుగుదల కోసం ఐరన్, ప్రోటీన్లతో కూడిన ఆకుకూరలు, సమతుల ఆహారం తీసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం హేమలత, స్థానిక అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

కనగానపల్లి: మహిళల వ్యక్తిగత పరిశుభ్రతపై మంగళవారం అన్ని ఆరోగ్య కేంద్రాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు పీహెచ్‌సీ డాక్టర్ చెన్నారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా కనగానపల్లిలో ఆయన మాట్లాడుతూ మహిళ రుతుక్రమం–ఆరోగ్య పరిశుభ్రత కార్యక్రమంలో భాగంగా స్థానిక ఆరోగ్య కేంద్రాల్లో మహిళలతో ఆరోగ్య సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా సీహెచ్‌ఓలు, ఆరోగ్య కార్యకర్తలు గ్రామాల్లో తిరుగుతూ రుతుక్రమం సమయంలో మహిళల్లో సంభవించే ఆరోగ్య సమస్యలు వాటి పరిష్కారంపై అవగాహన కల్పిస్తున్నారన్నారు. పలువురు సీహెచ్‌ఓలు, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

దివ్యాంగ విద్యార్థుల గుర్తింపుపై సర్వే



చెన్నేకొత్తపల్లిలో దివ్యాంగ విద్యార్థి తల్లితో మాట్లాడుతున్న అధికారులు

చెన్నేకొత్తపల్లి: రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగ విద్యార్థులను చదువుకునేలా ప్రోత్సహిస్తోందని ఐఈఆర్టీ వెంకటలక్ష్మి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో దివ్యాంగ చిన్నారుల గుర్తింపు సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దివ్యాంగ విద్యార్థులను గుర్తించేందుకు మండలవ్యాప్తంగా ఇంటింటి సర్వే చేస్తున్నామన్నారు. సర్వే ఈనెల 1 నుంచి జూన్ 11 జరుగుతోందన్నారు. ఇందులో 18 ఏళ్లోపు ఉన్న దివ్యాంగులను గుర్తించి ప్రభుత్వ పాఠశాల్లో చేరిస్తామన్నారు. ఇప్పటి వరకూ 30 మందిని గుర్తించామని తెలిపారు. చెన్నేకొత్తపల్లిలో జరిగిన సర్వేలో ఎంఈఓలు మున్వర్‌బాషా, ప్రసన్నకుమార్‌నాయుడు దివ్యాంగ విద్యార్థిని బడిలో చేర్పించాలని అతడి తల్లికి సూచించారు. అవసరమైన విద్యార్థులను భవిత కేంద్రంలో చేర్పించి ప్రత్యేక సేవలు అందిస్తామన్నారు. ఉపాధ్యాయుడు నాగేంద్ర, సీఆర్పీలు కేశవ, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి 'నిత్యసురభి' చేయూత



అభాగ్యురాలికి సాయమందిస్తున్న నిత్యసురభి ట్రస్టు నిర్వాహకులు

అనంతపురం కల్చరల్: నిత్యసురభిచారిటబుల్ ట్రస్టు పుట్టినిల్లు ఆశ్రమం ఆధ్వర్యంలో మంగళవారం ఓ అభాగ్యురాలికి చేయూతనందించారు. పార్వతమ్మ కాలనీలో ప్రమాదవశాత్తు మంచానికి పరిమితమైన అమీనా అనే మహిళకు ట్రస్టు అధ్యక్షురాలు డాక్టర్ నిర్మల మూడు నెలలకు సరిపడా నిత్యావసర వస్తువులు, కొంత నగదునందించి సాయపడ్డారు. అమీనాకు ప్రమాదం జరిగిన తర్వాత చూసుకోవడానికి కూడా ఎవరూ లేకపోవడం విచారకరమని దాతలు మరింత ముందుకు వస్తే ఆమె జీవనం సాఫీగా సాగుతుందన్నారు. ఆమె కుటుంబానికి ట్రస్టు వారు సాయమందిస్తారని తెలిపారు. కార్యక్రమంలో మునాఫ్, రాజు, షాహీనా, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

హోంగార్డు కుటుంబాలకు ఆర్థిక చేయూత



చెక్కు అందజేస్తున్న ఎస్పీ గౌతమిశాలి

అనంతపురం: రోడ్డు ప్రమాదం, అనారోగ్య కారణాలతో వేర్వేరుగా మృతి చెందిన ఇద్దరు హోంగార్డుల కుటుంబాలకు ఎస్పీ గౌతమి శాలి ఆర్థిక చేయూతనందించారు. రూ.8,77,200 విలువ చేసే రెండు చెక్కులను బాధిత కుటుంబసభ్యులకు మంగళవారం అందజేశారు. అనంతపురం పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో పనిచేస్తున్న హోంగార్డు నిజాముద్దీన్ రెండున్నరేళ్ల క్రితం మృతి చెందారు. అలాగే శ్రీసత్యసాయి జిల్లా చెన్నేకొత్తపల్లి పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న హోంగార్డు నాగప్ప ఈ ఏడాది ఫిబ్రవరి 6న రోడ్డు ప్రమాదంలో మరణించారు. ఈ క్రమంలో నిజాముద్దీన్ తండ్రి రుక్మానుద్దీన్‌కు రూ.4,38,600, నాగప్ప భార్య ఉదయకు రూ.4,48,600 విలువ చేసే చెక్కులను ఎస్పీ అందజేశారు. జిల్లా హోంగార్డులు తమ గౌరవ వేతనంలో ఒక రోజు వేతనాన్ని సహచర కుటుంబాలకు అందజేయడాన్ని ఈ సందర్భంగా ఎస్పీ అభినందిచారు.

వ్యక్తిగత పరిశుభ్రతతోనే వ్యాధుల నియంత్రణ



ర్యాలీలో పాల్గొన్న డీఎంహెచ్‌ఓ భ్రమరాంబదేవి

అనంతపురం మెడికల్: రుతుక్రమ సమయంలో మరింత జాగ్రత్తలు పాటించడంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రతతోనే వ్యాధులను నియంత్రించుకోవచ్చునని మహిళలకు డీఎంహెచ్‌ఓ డాక్టర్ భ్రమరాంబదేవి సూచించారు. రుతుక్రమ ఆరోగ్యం, పరిశుభ్రత దినాన్ని పురస్కరించుకుని రాష్ట్రీయ బాల ఆరోగ్య విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ర్యాలీని ఆమె ప్రారంభించారు. 10 నుంచి 45 ఏళ్ల వయసు వరకూ మహిళలకు రుతుస్రావం సర్వసాధారణమన్నారు. ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ సుజాత, డాక్టర్ యుగంధర్, డాక్టర్ నారాయణస్వామి, డాక్టర్ రవిశంకర్, ఓబులు, డెమో ఉమాపతి, డీఈఐసీ మేనేజర్ రజిత పాల్గొన్నారు.

జీవాల లోడ్‌తో వ్యక్తి పరారీ

పామిడి: అనంతపురం మార్కెట్‌యార్డుకు విక్రయానికి వెళ్లిన పామిడి మండల రైతుల జీవాల లోడ్‌తో ఓ యువకుడు పరారైన సంఘటన మంగళవారం ఆలస్యంగా వెలుగుచూసింది. విశ్వసనీయ సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండలానికి చెందిన కొందరు రైతులు 150 గొర్రెలను విక్రయించేందుకు అనంతపురం మార్కెట్‌యార్డుకు గత శనివారం తీసుకెళ్లారు. అక్కడ శింగనమల మండలం ఇరువెందుల గ్రామవాసి, వ్యాపారి కృష్ణ మరుసటి రోజు డబ్బు చెల్లిస్తానంటూ నమ్మబలికి జీవాల లోడ్‌తో ఉడాయించాడు. రెండు రోజులైనా యువకుడు జీవాల డబ్బు చెల్లించకపోవడంతో బాధిత రైతులు లబోదిబోమంటున్నారు.

'ఎర్రపోతన్నకు సీపీఐతో సంబంధం లేదు'

రాప్తాడురూరల్: భారత కమ్యూనిస్ట్ పార్టీ (సీపీఐ) అనంతపురం రూరల్ మండలం సోములదొడ్డి శాఖలో పని చేస్తున్న ఎర్రపోతన్న అనే వ్యక్తికి ఇకపై పార్టీకి ఎలాంటి సంబంధం లేదని సీపీఐ మండల కార్యదర్శి మేకల రమేష్ స్పష్టం చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఎర్రపోతన్న తమ పార్టీ పేరు చెప్పుకుని పార్టీకి వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతూ క్రమశిక్షణ చర్యలు ఉల్లంగించడంతో పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు వెల్లడించారు. బయట ఎక్కడైనా సీపీఐ పార్టీ పేరు చెప్పుకుని వ్యక్తి గత పనులు చేసుకుంటే.. ఆ పనులకి తమ పార్టీ కి ఎలాంటి సంబంధం లేదని రమేష్ పేర్కొన్నారు.

రేపు మెగా రిటైల్ ఎక్స్‌పో

అనంతపురం: రాంనగర్‌లోని రాయల్ ఫంక్షన్ హాలులో గురువారం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మెగా రిటైల్ ఎక్స్‌పో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు బ్యాంకు రాంనగర్ బ్రాంచి చీఫ్ మేనేజర్ జి. రాజేష్ తెలిపారు. వ్యక్తిగత రుణాలు, వాహన, గృహ, విద్య, బంగారు రుణాలు మంజూరు చేస్తామన్నారు. వీటి మంజూరుపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బ్యాంక్ రీజనల్ మేనేజర్ జితేంద్ర కుమార్ మిశ్రా హాజరవుతారన్నారు. మెగా సదస్సులో పాల్గొని అర్హత గల వారు రుణ సదుపాయం పొందాలని ఆయన సూచించారు.

లక్ష్మీ నారసింహా...నమో నమః



పెన్నహోబిలం లక్ష్మీనృసింహుని రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

ఉరవకొండ: ఉరవకొండ సమీపంలోని పెన్నహోబిల పుణ్యక్షేత్రం ఆలయ పరిసర ప్రాంతాలు లక్ష్మీ నరసింహా..నమో నమః అంటూ మార్మోగిపోయాయి. మంగళవారం పెన్నహోబిల లక్ష్మీనృసింహుడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రధాన ఘట్టమైన బ్రహ్మరథోత్సవం కనుల పండువగా సాగింది. వేలాదిగా భక్తులు తరలివచ్చి గోవింద..గోవింద అంటూ నామస్మరణ చేశారు. ఆలయ పరిసర ప్రాంతాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. పెన్నహోబిలం లక్ష్మీనృసింహస్వామి మడుగుతేరు ఉత్సవంలో మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి పాల్గొన్నారు. స్వామికి విశేష పూజలు నిర్వహించిన అనంతరం మడుగుతేరులో పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే విశ్వకు ఆలయ అధికారులు తీర్థప్రసాదాలు అందించారు. ఆలయ ఈఓ విజయ్‌కుమార్, ప్రధాన అర్చకులు ద్వారాకానాథ్‌చార్యులు, వైస్ ఎంపీపీ వై.శ్రీనాథ్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర నేతలు అశోక్, తేజోనాథ్, మూలగిరిపల్లి ఓబన్న పాల్గొన్నారు.

ఘనంగా గోకుల ఆలయ వార్షికోత్సవం



విశేష పూజలందుకున్న గోవింద వేంకటేశ్వరుడు

అనంతపురం కల్చరల్: నగరంలోని గోకుల వెంకటేశ్వరస్వామి మందిర వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. కలెక్టరేట్ సమీపంలో ఉన్న ఇస్కాన్ వారి గోశాలలో మందిర నిర్వాహకులు తెల్లవారుజామున సుప్రభాత సేవ, స్వామి వారికి మహాభిషేకం, అష్టదళ పాదపద్మార్చన చేపట్టారు. సాయంత్రం గోశాలలోని వందలాది గోవులకు భక్షజనం గోపూజలు ఆచరించారు. అనంతరం తులసీ హారతి, స్వామివారి ఏకాంత సేవ శాస్త్రోక్తంగా సాగాయి. ఈ సందర్భంగా ఇస్కాన్ నిర్వాహకులు గోవిందుని, గోశాల ప్రాముఖ్యతను భక్తులకు వినిపించారు. ఇస్కాన్ గోశాల మందిర ప్రతినిధులు దామోదర గౌరంగదాసు , సుదర్శన పద్మనాభ ప్రభు తదితరులు ప్రసాద వితరణ చేశారు.

వెంకటేశ్వర ఫిజియోథెరపీ కాలేజీ స్నాతకోత్సవం



పట్టాలందుకున్న విద్యార్థులు

అనంతపురం రూరల్: నగర శివారులోని బైపాస్ కొడిమి క్రాసు వద్ద ఉన్న వెంకటేశ్వర ఫిజియోథెరపీ కాలేజీలో మంగళవారం కళాశాల ప్రథమ స్నాతకోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆదర్శ నర్సింగ్ కాలేజీ, వెంకటేశ్వర ఫిజియోథెరపీ విద్యార్థులు ఆటపాటలతో ఆకట్టుకున్నారు. ప్రభుత్వ జనాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు ఫిజియోథెరపీ, నర్సింగ్ కోర్సుల ప్రాముఖ్యతను వివరించారు. కళాశాల యాజమాన్యం తీసుకుంటున్న సేవలను కొనియాడారు. సొసైటీ కరస్పాండెంట్ సతీష్ మాట్లాడుతూ బీపీటీ, ఎంపీటీ, బీఎస్సీ నర్సింగ్ ఎమ్మెస్సీ, పోస్ట్ బీఎస్సీ, జీఎన్‌ఎం తదితర కోర్సులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అనంతరం డైరెక్టర్ రేవంత్ ముఖ్య అతిథులతో పాటూ అధ్యాపక సిబ్బందిని సత్కరించారు. వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులందించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కూడేరు: మండలంలోని ముద్దలాపురం సమీపంలో వైటీ శివారెడ్డి తోట వద్ద అనంతపురం–బళ్లారి ప్రధాన రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఉదిరిపికొండకు చెందిన నాగరాజు, అరుణ గాయపడ్డారు. వీరు అనంతపురం నుంచి ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి వెళ్తుండగా, ఉరవకొండ నుంచి అనంతపురం వైపు అతి వేగంగా వస్తున్న ద్విచక్ర వాహనం ఢీకొనింది. గాయపడిన వారిని 108 వాహనంలో అనంతపురం ఆస్పత్రికి తరలించారు.